క్లుప్తంగా

జీవన శైలి మార్పులతో రక్తపోటు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: జీవన శైలి విధానంలో చోటు చేసుకున్న మార్పులతో అత్యధికంగా రక్తపోటు సంక్రమిస్తోందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని వేదగిరివారిపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 50 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నేత మృతి



కన్నయ్య (ఫైల్)

బంగారుపాళెం: మండలంలోని జంబువారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కన్నయ్య(65) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కన్నయ్య మృతి పట్ల పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలిపారు.

హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

ఐరాల: ప్రభుత్వ పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభం కానున్నట్లు ఎంఈఓలు రుషేంద్రబాబు, దామోదర్‌నాయుడు తెలిపారు. మండల వ్యాప్తంగా 7 ఉన్నత పాఠశాలలు, నాలుగు ప్రాథమికోన్నత పాఠశాలలు, 54 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లో 28,74 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

బంగారుపాళెం: జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ నాయకులు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. నియోజకవర్గ కార్యదర్శి శంకరన్ మాట్లాడుతూ, జర్నలిస్టులకు ప్రభుత్వం సకాలంలో అక్రిడిటేషన్లు జారీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి, జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత, వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన జర్నలిస్టుల చట్టాలను తిరిగి పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సురేంద్ర, సభ్యులు నాగరాజ, జ్యోతినాథ్ పాల్గొన్నారు.

ఎల్‌బీపురంలో గంగజాతర



అమ్మవారికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని ఎల్‌బీపురంలో బుధవారం గంగజాతర నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి విశేష పూజలు చేసి అమ్మవారి ఊరేగింపును ప్రారంభించారు. ఊరంతా అమ్మవారు కర్పూర హారతి అందుకుని భక్తులకు అభయమిచ్చారు. డప్పు వాయిద్యాల నడుమ ఊరేగారు. స్థానిక చెరువులో అమ్మవారిని నిమజ్జనం చేశారు.

శ్రీసత్యనారాయణస్వామి వ్రతం



ప్రత్యేక అలంకారంలో సత్యనారాయణస్వామి

బంగారుపాళెం: మండలంలోని మాధవనగర్ బ్రహ్మానందాశ్రమంలో బుధవారం శ్రీసత్యనారాయణ స్వామి వ్రత పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా శ్రీసత్యనారాయణస్వామి మూల విగ్రహానికి ఆశ్రమ నిర్వాహకుడు కేశవానంద స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాన్ని చేపట్టారు. స్వామి వారి వ్రత పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు, పరిసర గ్రామస్తులు పాల్గొన్నారు.

కూటమి దాడులు.. దారుణాలు

ఏడాదిగా కూటమి సాగించిన దాడులు, దారుణాలు ప్రజలను భయాందోళనకు గురిచేశాయి. జిల్లాలో మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే చిత్తూరు నియోజకవర్గానికి ఓ ప్రత్యేకత ఉంది. ఎన్నికల అనంతరం అన్ని పార్టీల నాయకులు ఎవరి పనుల్లో వారు మునిగిపోతారు. ఫ్యాక్షన్, దాడుల సంస్కృతి చిత్తూరులో 2024కు ముందు ఎప్పుడూ కనిపించలేదు. కానీ 2024 ఎన్నికల ఫలితాల అనంతరం చిత్తూరు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అధికారంలోకి రావడానికి కూటమి నేతలు ప్రకటించిన 'సూపర్ సిక్స్' ఎప్పుడు అమల్లోకి వస్తుందని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఇది చాలదన్నట్లు ఎమ్మెల్యే అభ్యర్థిగా గురజాల జగన్‌మోహన్ నాయుడు, ఎంపీ అభ్యర్థిగా దగ్గుమళ్ల ప్రసాదరావు ఇచ్చిన సొంత మేనిఫెస్టోలో ఒక్కటీ కార్యరూపం దాల్చిన దాఖలాలులేవు.

కానీ చిత్తూరుకు మాత్రం ఓ కొత్త సంస్కృతిని తీసుకొచ్చి ప్రాణం పోశారు. అదేంటంటే దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, అణగదొక్కే ఘటనలు. ప్రతిపక్షంలోని కీలక నేతలే లక్ష్యంగా ఏడాది కూటమి పాలనలో చిత్తూరు రావణకాష్టంలా రగులుతూనే ఉంది. అధికార పార్టీ నేతలు వేటకత్తులు చేతబట్టి నగర వీధుల్లో ప్రతిపక్ష నాయకులను వెంటాడిన ఘటనలు ప్రజలను ఉలిక్కిపడేలా చేశాయి. అభివృద్ధిని పూర్తిగా విస్మరించిన అధికార పార్టీ నేతలు.. ఆ పార్టీలో ఉన్న కొందరు నేతల ట్రాప్‌లో చిక్కుకుని సంక్షేమాన్ని విస్మరించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసేసుకున్నారు. ఏడాది కూటమి పాలనలో చిత్తూరులో చోటుచేసుకున్న ప్రధాన సంఘటనలపై చిత్రాల సమాహారం.

- చిత్తూరు అర్బన్



చిత్తూరు నగరంలోని ఆఫీసర్స్ లైన్‌లో ఉన్న గ్రానైట్ ఏజెన్సీ కార్యాలయంలో పెట్రోలు పోసి నిప్పటించారు



దొడ్డిపల్లెలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త తులసీరామ్‌ను కిడ్నాప్ చేసి మోకాళ్లపై కూర్చోపెట్టి చావ బాది, వీడియోలు తీసి వైరల్ చేశారు



వేటకత్తులు చేతపట్టి చిత్తూరులో వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఇళ్ల వద్దకు వెళ్లి భయానక పరిస్థితులు కల్పించారు.



చిత్తూరు నగరం బోడికొండకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఖాదర్‌ను కిడ్నాప్ చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు



గుడిపాల మండలం మందికష్టాపురానికి చెందిన సురేష్‌పై టీడీపీ నాయకులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు



చుడా మాజీ చైర్మన్ పురుషోత్తంరెడ్డిని హత్య చేయాలని ప్లాన్ చేసి, ఆయన లేకపోవడంతో కారును ధ్వంసం చేశారు



సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు చిత్తూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మురళీరెడ్డిని హత్య చేసేందుకు యత్నించారు.




చిత్తూరు రూరల్ అనగల్లులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త సుబ్రమణ్యంకు చెందిన మామిడి తోటకు నిప్పు పెట్టారు



కొంగారెడ్డిపల్లె, డీఐ రోడ్డులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రసన్నకు చెందిన దుకాణాలను ధ్వంసం చేశారు



చిత్తూరు 'సాక్షి' కార్యాలయంపై టీడీపీ మహిళలు దాడి చేసి, బోర్డులు ధ్వంసం చేశారు



చెర్లోపల్లెలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మురుగన్ ఇంటిపై దాడిచేసి వాహనాలను ధ్వంసం చేశారు.

వరదరాజులస్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు



సత్యనారాయణ వ్రతంలో భక్తులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైనా శ్రీ భూదేవి సమేత వరదరాజుల స్వామి ఆలయంలో బుధవారం పౌర్ణమి పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా అభిషేకం చేయించారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సత్యనారాయణ వ్రతం ఆచారించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

60 మంది రోగులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: మండలంలోని మరకాలకుప్పం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ రష్మిత 60 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధి గ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది యమున, రాధ, దేవప్రీత పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రారంభం కానున్న బడులు

బంగారుపాళెం: వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి మండలంలోని అన్ని పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఓ వైపు పాఠశాలలు ప్రారంభం, మరోవైపు ఉపాధ్యాయుల బదిలీల గందరగోళం నడుమ ఈ ఏడాది విద్యాసంవత్సరం అడుగు పెడుతోంది.

గత ప్రభుత్వంలో పేద విద్యార్థుల చదువుల కోసం జగనన్న విద్యాకానుక కింద ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, యూనిఫాం దుస్తులు అందించడమే కాకుండా అమ్మ ఒడిపథకం కింద విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో 15 వేల రూపాయలు నగదు జమచేశారు. ఈ సారి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తి అవుతున్నా విద్యార్థులకు తల్లికి వందనం పేరుతో నగదు అందిస్తామని చెప్పి ఇంత వరకు ఆ పథకం అమలు చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఎస్‌ఈగా విజయ్‌కుమార్

చిత్తూరు కార్పొరేషన్: ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈగా విజయ్‌కుమార్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఈఈగా ఉన్న నరేంద్రకుమార్ తిరుపతి ఈఈగా బదిలీ అయ్యారు. అక్కడ ఉన్న విజయ్‌కుమార్ ఇక్కడికి వచ్చారు. ఈయనకు ఇన్‌చార్జి ఎస్‌ఈగా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. గతంలో తిరుపతి ఈఈగా ఉన్న విజయ్‌కుమార్ చిత్తూరు, తిరుపతి జిల్లాల ఇన్‌చార్జి ఎస్‌ఈగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న విషయం తెలిసిందే. అనంతరం ఉద్యోగులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



ఇన్‌చార్జి ఎస్‌ఈ విజయ్‌కుమార్‌ను కలిసిన ఉద్యోగులు

శ్రీజ డెయిరీతోనే పాడి రైతుల అభివృద్ధి



మినరల్ మిక్చర్‌ను అందజేస్తున్న డెయిరీ నిర్వాహకులు

గుడిపాల: శ్రీజ డెయిరీ ద్వారానే పాడి రైతుల అభివృద్ధి సాధ్యమవుతుందని డెయిరీ ఏరియా మేనేజర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. వసంతాపురంలో బుధవారం రాత్రి పాడి రైతులకు ఉచితంగా మినరల్ మిక్చర్‌ను ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మహిళా సభ్యుల ద్వారానే రోజుకు 7 లక్షల పైచిలుకు పాలను శ్రీజ గ్రామ స్థాయి నుంచి సేకరించనున్నట్లు తెలిపారు. దీంతో పాటు మహిళా పాడిరైతులకు ప్రతి సంవత్సరం బోనస్ ఇచ్చినట్లు ఆయన గుర్తుచేశారు. ఆయనతో పాటు ఏరియా ప్రొడ్యూసర్ ఇన్‌స్టిట్యూషన్ అధికారి నాగభూషణ్ యాదవ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

బంగారుపాళెం: స్థానిక స్టేట్ బ్యాంక్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పాలేరు పంచాయతీ నేతాజీ నగర్‌కు చెందిన ఆదిశేషు ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఓమ్ని కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన యువకుడిని చీలాపల్లె సీఎంసీకి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అర్ధగిరిలో ఏరువాక పౌర్ణమి వేడుకలు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామికి అభిషేకం, గంధం, తమలపాకులు, తులసిమాలలతో ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామికి పూజలు నిర్వహించి ధూప దీపనైవేద్యం సమర్పించారు. గంధంతో ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామిని భక్తులు దర్శించుకున్నారు. పౌర్ణమి వేడుకలను తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ఉచిత ప్రసాదాలను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

ఆలయ ఆవరణలో ఉభయదారులచే భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం నిర్వహించారు. వేదపండితులు వేదమంత్రోచ్ఛరణ చేస్తూ సుదర్శన హోమం నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. హోమంలో ఆలయ ఈఓ హనుమంతురావు, ఉభయదారులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రాకారోత్సవం

ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఆలయ ఈఓ హనుమంతురావు పర్యవేక్షణలో అర్చకులు ఉత్సవమూర్తికి అభిషేకం పూజలు చేయించి ప్రాకారోత్సవాన్ని వైభవంగా చేయించారు. భక్తులు స్వామికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అర్ధగిరికి విచ్చేసిన భక్తులు కాలక్షేపానికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.